# మలయమారుతం

—గ్లాస్గోపంచె...జరీనంబరు పాదంమీద పరచుకునేట్టుగా...అంచు పద్మాగ్రంలాగా అమరికగా బంగాళీకట్టూ అల్లికబనియన్...ఉల్లిపొర...గీరలలాల్చీ ... పక్క జేబులో ఘుమాయించే జేబురుమాలు ... పై జేబులో, ఆకారం, అంకెలూ, చూచాయగా కనబడుతూ, పదిరూపాయల నోట్ల బొత్తి...బుగ్గను రూపాయకిళ్ళీ...

...అనుకున్న ప్రకారం... వేళకు సరిగా...ఆ గుమ్మం ఎక్కాడు...సత్యం...

తలుపు ఓరవాకిలిగా ఉన్నది: చెప్పుల చప్పుడు విని...లోపలినుంచి 'వచ్చె...వచ్చె...' అనుకుంటూ... ఆ అమ్మాయి తల్లి...హాలులో దీపం పెద్దదిచేసి, తలుపుతీసి

'రా నాయనా' అని పలుకరించి, గుమ్మంలోకి వచ్చి, వీధి అటూ ఇటూ తొంగిచూసి వెనుకనుంచి, తలుపు వేసింది...

'...కూర్చోండి అలా నిలుచుంటారే: ఇప్పుడే... యిందాకటినుంచీ మీరు వస్తారుకదా అని యిక్కడే కూర్చుని...ఇప్పుడలోపలికి వెళ్లాను పాలల్లో తోడువేసి వద్దామని...మీరూ రానే వచ్చారు...అమ్మాయీ!...వారు వచ్చారే...'

చంద్రం...అవతల వసారాలోంచి... ఆ పక్కగదిలోకి వెళుతూ తనవేపుచూసి ఒక్కమారి తళుక్కుమన్నది: సత్యం...జేబులోనుంచి పైకంతీసి, ముసలిదానికి యివ్వబోయినాడు.

'నాకెందుకు బాబూ! మీవంటివారు మా యింటికి రావడం...అమ్మాయి అదృష్టముకొద్దీ - అదే నాకు పదివేలు...ఇక మీ యిష్టం...మీ యిష్టం...యిచ్చుకోండి, మానుకోండి. నేనల్లాచూసి సంతోషించడమే..." అని... లోపలికి చక్కాబోయింది.

చంద్రం ఏ గదిలోకి వెళ్ళిందో...సత్యం...అందులోనే ప్రవేశించాడు...కలకల లాడుతూ ఉంది...

లేచి నిలుచుని...సోఫామీద నుంచి...నవ్వుతూ... కనులతో పలుకరించింది...చొరవగా చేజాపి పట్టుకోబోయినాడు...కొంటెగా తప్పించుకుని తలుపువేపు తల విసిరింది... వెళ్ళి గడియ వేశాడు...

'ఇదుగో...ఇంద—' జేబులోనుంచి...నోట్లు బయటకు తీస్తున్నాడు. చంద్రం కోపంగా...'డబ్బు...మీరే ఎరుగున్నారు: మే మెన్నడూ డబ్బు మొగమే చూడలేదు... ఆ బల్లమీద పారేయండి...'

జవాబు చెప్పకుండా ... అయిదునోట్లూ – ఆమెకు కనబడేలాగున విడబరచి లెక్కపెట్టినట్లు నటించి. మళ్లా బొత్తిచేసి...బల్లమీద పొందాను...ఎత్తిపెట్టాడు...

'కూర్చోండి...'

'నీవుకూడా...ఇక్కడ...'

'మీకు ఎదురుగా...ఇక్కడ.'

'ఉహుఁ...ఇక్కడ నా పక్కను.'

'అమ్మో...ఆశే...మీరు మంచి పిల్లవాళ్ళు కారు.'

సత్యానికి...యీ చెలగాటం అదో సరదాగా ఉంది: ఖరీదు యిచ్చి కొనుక్కున్నా...ఆమాట అని రసాభాసం చేసుకోవడంకంటె...యిదీ బాగానేవుంది...కొత్తగా సంసార పక్షంగా...

'వీణ...వాయించనా...'

—అక్కరలేదు...అని తల ఊగించాడు...చంద్రం త్రాచులాగా లేచింది... 'మీరేం సరసులు...మొక్కు తీర్చుకోవడమైతే ... యిక్కడకు రావడం దేనికి ... యింటి దగ్గరనే ... పడివుంటే ... యీ పాటికి పక్కంతా చెల్లా చెదురూ చేసుకొని...యిల్లాలూ మీరూ నిదురపోతూ వుండేవారుగా...యిందుకోసం...యీఖర్చంతా ఎందుకు...

యింతే యీ కాలంవాళ్లు...కొనుక్కుందామని వుబలాటమే కాని...తీరా అక్కడకు వచ్చేటప్పటికి ... అనుభవించడం చేతకాదు...'.

'పోనీలే...వింటాను...'.

'ఏం...నన్ను ఉద్ధరించడానికా ?... నాపాట వినడానికి యింతకన్న ఎవరూదొరకరనా... చెప్పండి... యిదేం బలవంతం బ్రాహ్మణార్థంకాదు...సరసాలేమీ నేరువకుండా ...అందుకోసమే వచ్చారనంటే...నేను కాదనను...మిమ్మల్ని ఎంతో ఒప్పించాలని...మల్లె మొగ్గల వంకీజడ వేయించుకున్నాను...పాము కుబుసంలాంటి వుప్పాడచీరె ... మొగలి చాయ రవిక ... యిదుగో యీ ప్రక్కనుండి పండు వెన్నెల...మీరు చక్కగా...నవమన్మథులులాగా నాచేత గంధం పూయించుకుని, పన్నీరు చల్లించుకుని...హాయిగా... నేను మీ యెనుట కూర్చుని వీణవాయించిన తర్వాత... ఆమీద... నామీద ప్రేమతో... ఎంతో అనుకున్నాను... మీరు వస్తామని కబురుపంపినప్పటినుంచీ మిమ్మల్ని మెప్పించడానికి...ఎన్నో ఊహించాను. పోనీండి...మీకు అవన్నీ వెగటైతే...అవొక్కటే అవసరమైతే ... ఎన్నికోరికలున్నా... ఎప్పుడూ మా బ్రతుకింతేకదా ... మాకు దొరికేవారు... ఎన్నడూ యీపాటివారేకదా అని...ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంటాను...చెప్పండి...మీకు మొగమాటమెందుకు?...'

'—నేనంత పశువును కాను...నిన్ను చూడగానే... మనసు నిలుపలేకపోయినాను కాని...నొప్పించాలని కాదు...

నాకూ హృదయం ఉన్నది ... అనుభవించాలనే కోరిక ఉన్నది...అందుకనే నిన్ను వెదుక్కుంటూ వచ్చింది...'

'అంత ధర పెట్టింది...'

'ఆమాట అనకు...నాకు చిన్నతనం వేస్తుంది... తలవంచుకోవలసి వస్తుంది...అన్నీ కొనగలమా...ఐశ్వర్యము ఎంత ఉండనీ...అందులోనూ, నిన్ను...'

'—ఎంతవారండీ...నా మనస్సు కనుక్కోవాలని వేసిన పన్నాగమా యిదిఅంతా...నాకూ తెలియక కాదులెండి... చూడ్డగానే పోల్చుకున్నాను. అయినా, ఏదారికి వస్తారో అని...అమ్మ దొంగా...'

—సత్యం కొంచెం యిరకాటంలోనే పడ్డాడు.

గడియారంముళ్ళు రెక్కలు కట్టుకున్నంత వేగంతో... కాలాన్ని గిరగిర లాడించుతూన్నవి : బింకానికిపోయి...పెద్ద చిక్కు తెచ్చిపెట్టుకున్నాడు ... ప్రొద్దుచాలాపోయింది ... సంగీతం గింగీతం యిప్పుడు వద్దులే...అంటే చంద్రం అతి చులకనగా చూస్తుంది. సానికూతురి ఎన్నికలో అంత వాసి చెడటం...ఎంతమాత్రమూ పరువైన పనికాదు ... కాదు కూడదు...అంటే ఒప్పుకోక ఏం చేస్తుంది. కాని...ఆఖరికి... ఆ అమ్మాయి తనను అసహ్యించుకోవడమా ?...

ఎన్ని కప్పుల టీ త్రావినా...అందుకోసం పవలంతా నిద్రపోయినా...వేసుకున్న కిల్లీ పూరాగా వేడిచేసి...మత్తుగా, తమాషాగా...ఏలాగో ఉంది ఒంట్లో...అయినా...ముందు,

ఒకసారి ముద్దిడుకోనిచ్చినా ... ఊహుఁ ... చంద్రం దగ్గరకే రాందే...

'ఒప్పుకున్నాను కాని......ఒక్క ముద్దు......' అని రాబోయే నిదురను బలవంతాన బిగబట్టి...పసివాడిలాగా ప్రతిమాలుతూ అడిగాడు...

ఊఁ...ఇప్పుడా ?......మెప్పుకు ...... ఆనక ఆ బహుమానాలు !...అని నవ్వుతూ ... తివాచీమీద కూర్చుని...చంద్రం వీణె సారించింది.

—చల్లని...గాలి...ఒళ్లు మరిపించే...పాట !

—తెల్లవారి...ఒంటరిగా మేలుకున్న తరువాత... అనుకుని ఉసూరుమన్నాడు...అప్పుడు అల్లా కూర్చున్న చోటనే నిదురపోయినానుకదా అని...అనుకునిమాత్రం ఏం లాభం...కోపం అంతా ఎదురుగుండా గవిసెనలేని వీణమీద చూపించాడు...ఒకటి రెండు తీగెలు పుటుక్కుమనిపించి... వంచినతల ఎత్తకుండా...మంచులో తడిసిన మల్లెపువ్వులాగా ...చెక్కుచెదరకుండా...యింటికి వచ్చి...మంచంమీద నిదురకు వ్రాలాడు.